జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 93॥ శుక్రవారం ॥ 28-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-





28 ఆగస్టు 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:05 సూర్యాస్తమయం - సా. 6:29 తిథి పౌర్ణమి ఉ. 9:46 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం శతభిష తె. 3:02ం వరకు తరువాత పూర్వాభాద్ర యోగం అతిగండ ఉ. 7:24 వరకు కరణం బవ ఉ. 9:46 వరకు భాలవ రా. 9:53 వరకు వర్జ్యం ఉ. 9:44 నుండి ఉ. 11:24 వరకు దుర్ముహూర్తం ఉ. 8:34 నుండి ఉ. 9:23 వరకు మ. 12:42 నుండి మ. 1:31 వరకు రాహుకాలం ఉ. 10:44 నుండి మ. 12:17 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:56 వరకు గుళికాకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:11 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:29 నుండి తె. 5:17 వరకు అమృత ఘడియలు రా. 7:43 నుండి రా. 9:23 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:42 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

## మీరాలం ట్యాంక్ పర్యాటక కేంద్రం...

# ఆకస్మికంగా తనిఖీ

### అభివృద్ధి పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



### పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు

## వేగవంతమైన చర్యలు

### సస్పెన్షన్ బ్రిడ్జ్, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాట్లపై సూచనలు

### నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం

2

హైదరాబాద్‌లోని మీరాలం ట్యాంక్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెరువు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, పర్యాటకులను ఆకర్షించేలా అత్యుత్తమ ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా ప్రాజెక్టు పురోగతి, భవిష్యత్ ప్రణాళికలను ముఖ్యమంత్రికి వివరించారు.



### హిమాలయాన్ని కుదిపేసిన

# నేపాల్ మహావిపత్తు

### 168 మందికి పైగా మృతి వేలాది మంది గల్లంతు

### హిమనదం కూలిపోవడంతో విరుచుకుపడ్డ జలప్రళయం

### కైలాస్ యాత్రికులు, విదేశీ పర్యాటకుల ఆచూకీ కోసం గాలింపు

### మరో వరద ముప్పుపై అధికారుల హెచ్చరిక

నేపాల్–టిబెట్ సరిహద్దు ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు అపూర్వ విధ్వంసాన్ని సృష్టించాయి. హిమాలయాల్లోని ఒక భారీ హిమనదం కూలిపోవడంతో ఏర్పడిన నీరు, బురద, రాళ్ల ప్రవాహం భోటే కోషి, త్రిశూలీ నదీ పరివాహక ప్రాంతాలపై విరుచుకుపడింది. తాజా సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 165 నుంచి 168 మధ్యకు చేరుకోగా, 1,300 నుంచి 1,500 మంది వరకు ఇంకా గల్లంతైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్ చరిత్రలో ఇటీవలి కాలంలో సంభవించిన అత్యంత ఘోర ప్రకృతి విపత్తుల్లో ఇది ఒకటిగా నిలిచింది.

ఖాట్మండు, ఆగస్టు 27: బుధవారం ఉదయం స్థానిక కాలమానం ప్రకారం సుమా రు 8:40 గంటల సమయం లో ఈ విపత్తు సంభవిం చింది. మొదట భూకంపం వచ్చినట్లు భావించిన అధికారులు, అనంతర పరిశీలనలో ఇది హిమనదం కుప్పకూలడం వల్ల జరిగిన భారీ శిథిల ప్రవాహమని నిర్ధారించారు. వేల (మిగతా 2వ పేజీలో)



# గుజరాత్‌లో

## అమిత్‌షా పర్యటన

### గుజరాత్ విద్యాపీఠ పట్టాభిషేక

### వేడుకలో పాల్గొననున్న కేంద్ర మంత్రి

### జల సంరక్షణకు సంబంధించిన పలు ప్రాజెక్టుల ప్రారంభం

అహ్మదాబాద్, ఆగస్టు 27: కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల పర్యట న నిమిత్తం గుజరాత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు అధికా రిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యా రంగం, క్రీడలు, జల సంరక్షణకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి తరువాయి 2 వ పేజీలో..



### అమరావతి నిర్మాణ పనులపై

# చంద్రబాబు సమీక్ష

### సీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం నిర్వహణ

### కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో సమీక్ష

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి పనుల పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఏపీసీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాజధాని ప్రాంతంలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనుల స్థితిగతులు, ప్రాజెక్టుల అమలు వేగం, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు.

అమరావతి, ఆగస్టు 27: సమావేశా నికి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృ ద్ధి శాఖ మంత్రి పీ.నారాయణ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పట్టణా భివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ విజయ్ రా మరాజు తదితర ఉన్నతాధికారులు హాజ రయ్యారు. రాజధాని నిర్మాణానికి సం బంధించిన వివిధ అంశాలపై అధికా రులు ముఖ్యమంత్రికి -2 వ పేజీలో..

# బీఆర్ఎస్‌పై కవిత

# సంచలన ఆరోపణలు

### పార్టీని హస్తగతం చేసుకునే కుట్ర జరుగుతోందని వ్యాఖ్యలు

### హరీష్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

### ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బలోపేతం చేస్తామని స్పష్టం



తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం, కొందరు ప్రముఖ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ బీఆర్ఎస్ పార్టీని కొందరు నేతలు హస్తగతం చేసుకునేందుకు అంతర్గతంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

హైదరాబాద్, ఆగస్టు 27: ముఖ్యంగా హరీష్ రావు వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పార్టీ భవిష్యత్తు నాయకత్వంపై రహస్యంగా చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ వంటి నాయకుడిని పక్కనబెట్టి పార్టీపై పూర్తి నియంత్రణ సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం తనకు అందిందని వెల్లడించారు. ఇటీవల మెదక్ జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశాల్లో పార్టీ వారసత్వ తరువాయి 2 వ పేజీలో..



### గోవా విమోచన యోధుల స్మారకాన్ని ప్రారంభించిన రాజ్‌నాథ్ సింగ్

#### పాత్రాదేవిలో పునర్నిర్మించిన స్మారక చిహ్నం ప్రారంభం

#### త్యాగాలను చిరస్మరణీయంగా నిలుపుకోవాలని పిలుపు

పణజి, ఆగస్టు 27: కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గోవాలోని పాత్రాదేవి ప్రాంతంలో పునర్నిర్మించిన హుతాత్మ స్మృతి స్మారకాన్ని ప్రారంభించారు. పోర్చుగీస్ పాలన నుంచి గోవా విమోచన కోసం జరిగిన చారిత్రక పోరాటంతో అనుబంధం ఉన్న ఈ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉ ందని ఆయన పేర్కొన్నారు. విమోచన ఉద్యమంలో పాల్గొన్న (మిగతా 2వ పేజీలో)



# విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

### గోపాలపురం పాఠశాలకు నూతన తరగతి గదులు

### రూ.30 లక్షల పనులకు మంత్రి శంకుస్థాపన

### సాంకేతిక విద్యతో యువతకు అవకాశాలు

### మహిళలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపిన పొంగులేటి

ఖమ్మం, ఆగస్టు 27: తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలో పేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి అన్నారు. గురువారం తిరుమలయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని తరువాయి 2 వ పేజీలో..

# నేటి రాశి ఫలాలు

మేషం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. కుటుంబ సభ్యులతో దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. చేపట్టిన వ్యవహారాలలో విజయం లభిస్తుంది. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో ఉంటాయి. బంధు మిత్రుల నుండి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. వృధా ప్రయాణాలు ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారములు మధ్యలో నిలిచిపోతాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు కలుగుతాయి. సన్నిహితులతో అకారణ విభేదాలు తప్పవు. అవసరానికి మించి ఖర్చులు పెరుగుతాయి.

మిధునం: వ్యాపారపరంగా ఉన్న ఇబ్బందులు క్రమక్రమంగా తొలగుతాయి. సమాజంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. నూతన వాహన, గృహ యోగములు ఉన్నవి. చిన్ననాటి స్నేహితులతో పాత జ్ఞాపకాలు పంచుకుంటారు. నిరుద్యోగుల ప్రయత్నాలు కలసివస్తాయి.

కర్కాటకం: నూతన వ్యవహారాలకు శ్రీకారం చుడతారు. దగ్గరి వారి నుండి కీలక విషయాలు తెలుస్తాయి. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురు చూస్తున్న అవకాశములు లభిస్తాయి. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పదవులు లభిస్తాయి. వ్యాపారమున లాభాలు కలుగుతాయి.

సింహం: దైవ సంబంధిత విషయములలో ఆసక్తి పెరుగుతుంది. చేపట్టిన పనులందు ఆటంకాలు తప్పవు. ఇంటా బయట సమస్యలు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చిన్నపాటి సమస్యలు తప్పవు. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి.

కన్య: సంతాన విద్యా విషయాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమాధిక్యత తప్పదు. వ్యాపార, ఉద్యోగాలలో ఆందోళనలు పెరుగుతాయి. ఆత్మీయులతో అకారణ కలహ సూచనలు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి.

తుల: వృత్తి, ఉద్యోగాలు సంతృప్తికరంగా ఉంటాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభించుటకు అనుకూల సమయం. ఉన్నత విద్యా ప్రయత్నాలు కలసివస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన సమావేశములకు ఆహ్వానాలు అందుతాయి. సంతాన శుభకార్య విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాలలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుంచి విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. కొత్త పరిచయాల వలన ఆర్థిక లాభాలుంటాయి. వ్యాపార ఉద్యోగాలలో అభివృద్ధి కలుగుతుంది. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు.

ధనస్సు: దూర ప్రయాణాలలో అవరోధాలు కలుగుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. మానసిక ప్రశాంతతకు దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి , ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. బంధు మిత్రుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి.

మకరం: వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం వలన నష్టాలు తప్పవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. నిరుద్యోగ యత్నాలు కలిసిరావు. నూతన ఋణ ప్రయత్నాలు కలిసిరావు. ఇతరులతో ఆలోచించి మాట్లాడటం మంచిది.

కుంభం: భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. ఆత్మీయులతో ఉన్న వివాదాలకు పరిష్కారం లభిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

మీనం: చేపట్టిన పనులందు శ్రమ అధికమౌతుంది. ఇతరులతో కొన్ని విషయాలలో మాట పట్టింపులు పెరుగుతాయి. గృహ నిర్మాణ పనులు వాయిదా వేస్తారు. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. దాయాదులతో స్థిరాస్తి విషయమై ఉన్న సమస్యలు కొంత ఆందోళన కలిగిస్తాయి.



# విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

గోపాలపురంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న ప్రాథమిక పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. గత పాలకులు అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించిన మంత్రి, ప్రజల ఆశీర్వాదాలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు గతంతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు అధిక నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మిస్తూ, వైద్యులు, సిబ్బందిని నియమిస్తున్నామని వివరించారు. సాంకేతిక విద్య బలోపేతానికి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యతనిస్తూ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు గత రెండున్నరేళ్లలో భారీ స్థాయిలో రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇళ్ల పథకాన్ని దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు.ం

# గుజరాత్‌లో అమిత్ షా పర్యటన

**అహ్మదాబాద్, ఆగస్టు 27**

అహ్మదాబాద్‌లో జరగనున్న కామన్వెల్త్ క్రీడల ఏర్పాట్లపై నిర్వహించే సమీక్ష సమావేశానికి కూడా ఆయన అధ్యక్షత వహించనున్నారు. క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఏర్పాట్ల పురోగతి, సమన్వయ చర్యలపై అధికారులతో చర్చించనున్నారు. రాష్ట్రంలో చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలకు సంబంధించిన పలు ప్రాజెక్టులను అమిత్ షా ప్రారంభించనున్నారు. నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జల సంరక్షణ ప్రాజెక్టులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి లభ్యతను మెరుగుపరచడంతో పాటు భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో స్థిరమైన నీటి నిర్వహణకు ఇవి దోహదపడనున్నాయని అధికారులు పేర్కొన్నారు. విద్య, క్రీడలు, మౌలిక వసతులు, జల సంరక్షణ వంటి కీలక రంగాలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొననున్న అమిత్ షా పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.



# గవర్నర్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి

**యశోదా ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై ఆరా**

**వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న రేవంత్ రెడ్డి**

**శివ ప్రతాప్ శుక్లాకు ధైర్యం చెప్పిన సీఎం**

**సీఎంతో పాటు ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరు**

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

అనారోగ్యంతో హైటెక్ సిటీలోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను కూడా తెలుసుకుని గవర్నర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, ప్రస్తుతం అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించినట్లు సమాచారం. గవర్నర్ ఆరోగ్యంపై ప్రభుత్వం నిరంతరం దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గవర్నర్‌కు ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిరక్షణకు వైద్యుల సూచనలను పాటించాలని సూచిస్తూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు. గవర్నర్ కూడా ముఖ్యమంత్రితో కొద్దిసేపు మాట్లాడినట్లు తెలిసింది. గవర్నర్‌ను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వెంట ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. వారు ఆస్పత్రి అధికారులు, వైద్య బృందంతో మాట్లాడి గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిన తర్వాత వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆయన ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. త్వరగా కోలుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు ఆకాంక్షలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పరామర్శతో గవర్నర్ ఆరోగ్యంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ మరోసారి స్పష్టమైంది. గవర్నర్ త్వరగా కోలుకుని సాధారణ కార్యకలాపాల్లో పాల్గొనాలని రాష్ట్ర ప్రజలు కూడా ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి వైద్యుల పర్యవేక్షణలో ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

# అమరావతి నిర్మాణ పనులపై చంద్రబాబు సమీక్ష

**మొదటి పేజీ తరువాయి**

వివరాలు అందించారు. అమరావతిలో చేపడుతున్న రహదారులు, ప్రభుత్వ కార్యాలయ సముదాయాలు, మౌలిక సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థలు, ప్రజా అవసరాల ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. ఇప్పటికే ప్రారంభమైన పనులు ఏ దశలో ఉన్నాయనే అంశంపై అధికారులు నివేదికలు సమర్పించారు. పనుల నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసే అంశంపై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. అలాగే నిర్మాణ పనులను చేపడుతున్న కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, సాంకేతిక అంశాలు, నిధుల వినియోగం, పనుల వేగవంతం వంటి అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పనులు మరింత వేగంగా ముందుకు సాగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.రాజధాని అమరావతి రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సమావేశంలో పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రాజధానిని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు వివరించారు. నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని సమావేశంలో అభిప్రాయపడిన ముఖ్యమంత్రి, ప్రాజెక్టుల అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజధాని అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమరావతి అభివృద్ధి ప్రక్రియకు మరింత ఊతమివ్వనున్నాయని అధికారులు పేర్కొన్నారు.



# బీఆర్ఎస్‌పై కవిత సంచలన ఆరోపణలు

**మొదటి పేజీ తరువాయి**

రాజకీయాలు, భవిష్యత్తు వ్యూహాలపై చర్చలు జరిగాయని ఆరోపించారు. ఈ సందర్భంగా హరీష్ రావుపై పలు ఆర్థిక, రాజకీయ ఆరోపణలు చేసిన కవిత, ఆయన గతంలో మంత్రిగా పనిచేసిన సమయంలో కొన్ని ప్రైవేటు సంస్థలతో భారీ స్థాయిలో వ్యాపార సంబంధాలు కొనసాగించారని వ్యాఖ్యానించారు. విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులతో జరిగిన వ్యాపార వ్యవహారాలపై ప్రభుత్వం దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే లండన్‌లో జరిగినట్లు చెబుతున్న కొన్ని సమావేశాలపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ, వాటి వెనుక ఉన్న అంశాలను తమ పార్టీ దశలవారీగా ప్రజల ముందుకు తీసుకువస్తుందని తెలిపారు. నిజంగా ఎలాంటి రాజకీయ లేదా ఆర్థిక ఒప్పందాలు జరగలేదంటే సంబంధిత అంశాలపై విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. రాజకీయంగా పరస్పరం విమర్శించుకోవాల్సిన వారు మౌనంగా ఉండటం వెనుక కారణాలు ఏమిటో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా కవిత తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అనేక కీలక అంశాల్లో ప్రభుత్వం స్పందించడంలో విఫలమైందని ఆరోపిం చారు. కృష్ణా జలాల పంపిణీ, ఉద్యోగ అవకాశాలు, రాష్ట్రానికి సంబంధించిన పలు సంస్థల్లో నియామకాలు, తెలంగాణకు రావాల్సిన హక్కుల విషయంలో ప్రభుత్వం తగిన పోరాటం చేయడం లేదన్నారు. తెలం గాణ ఉద్యమ స్ఫూర్తికి విరుద్ధంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శిం చారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన ప్రజల్లో పెరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణ హక్కుల విషయం లో మరింత దృఢంగా వ్యవహరించాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీపై కూడా కవిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# మీరాలం ట్యాంక్ పర్యాటక కేంద్రం

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

ట్యాంక్ చుట్టూ కొనసాగుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఓపెన్-టాప్ జీపులో ప్రయాణిస్తూ పరిశీలించారు. ప్రాంతమంతా తిరిగి పనుల నాణ్యత, పురోగతిపై ఆరా తీశారు. చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జ్ పనులను కూడా భారీ క్రేన్ సహాయంతో ఎత్తైన ప్రాంతానికి చేరుకుని పరిశీలించడం విశేషంగా నిలిచింది. మీరాలం ట్యాంక్‌లోకి మురుగు నీరు చేరకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. అలాగే చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా నాలాలను విస్తరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి నాణ్యతను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో చెరువులో వాటర్ స్పోర్ట్స్‌కు అనువైన ఏర్పాట్లు చేయా లని ముఖ్యమంత్రి సూచించారు. చెరువు మధ్యలో ఉన్న ఐలాం డ్‌లను ఆకర్షణీయంగా అభివృద్ధి చేసి ప్రత్యేక పర్యాటక కేంద్రా లుగా మార్చాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉండటం వల్ల దేశ విదేశాల నుంచి వచ్చే సందర్శకు లను ఆకట్టుకునే విధంగా ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటన సందర్భంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేయడంతో ప్రాజెక్టు పనులకు మరింత వేగం చేకూరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# హిమాలయాన్ని కుదిపేసిన నేపాల్ మహావిపత్తు

(మొదటి పేజీ తరువాయి)

టన్నుల మంచు, రాళ్లు, మట్టి ఒక్కసారిగా లోయల్లోకి దూసుకెళ్లడంతో నదుల్లో జలప్రవాహం అమాంతం పెరిగి దిగువ ప్రాంతాలను ముంచెత్తింది. సీసీటీవీ దృశ్యాల్లో బహుళ అంతస్తుల భవనాల ఎత్తుకు సమానంగా బురద, నీటి గోడ దూసుకురావడం కనిపించడం విపత్తు తీవ్రతను తెలియజేస్తోంది. రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. పలు గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. కనీసం 19 వంతెనలు, 40 కిలోమీటర్లకు పైగా రహదారులు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమవడంతో విద్యుత్ సరఫరా దెబ్బతింది. అనేక ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. గల్లంతైన వారిలో విదేశీ పర్యాటకులు, కైలాస్ మానససరోవర్ యాత్రికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. నేపాల్ అధికారుల వివరాల ప్రకారం వందలాది విదేశీయుల ఆచూకీ ఇంకా లభించలేదు. భారతీయులు, అమెరికన్లు, బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, కెనడా, మలేషియా తదితర దేశాల పౌరులు గల్లంతైన వారి జాబితాలో ఉన్నారు. భారత విదేశాంగ శాఖ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తుండగా, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాదాపు 300 మంది భారతీయులు గల్లంతైన వారిలో ఉన్నట్లు నేపాల్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో గాలింపు చేపడుతున్నాయి. ఇప్పటివరకు వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే భారీ బురద, దెబ్బతిన్న రహదారులు, కొనసాగుతున్న వర్షాలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి.

శ్వేత

# సంపాదకీయం

**శుక్రవారం 28-8-2026**

# మంచుకొండల్లో మహా విలయం

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి.

కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది.

కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంత య్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

# నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

**చైనా నిర్మిస్తున్న డ్యామ్‌తో భారత్‌కు ముప్పు.. ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు**



న్యూఢిల్లీ,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): నేపాల్ విలయం తరవాత ఇప్పుడు భారత్‌కూ ఇలాంటి ముప్పే పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే అది చైనా వల్లనే అని తెలుస్తోంది. బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ డ్యామే. బీజింగ్‌తో మనకు నదీజల వివాద పరిష్కార ఒప్పందాలు, యంత్రాంగం లేవు. బ్రహ్మపుత్రలో ప్రవాహ హెచ్చుతగ్గులు, వర్షపాతం వంటి సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికైతే ఒక అవగాహనా ఒప్పందం ఉంది. దాన్ని అయిదేళ్లకు ఒకసారి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత చైనా దాన్ని పునరుద్ధరించకపోతే.. భారత్‌కు పెను సమస్యగా మారుతుంది. దీనికి తోడు ఈ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో ప్రకృతి విపత్తులకూ ఆస్కారం ఎక్కువే. అందువల్ల భవిష్యత్తులో ఈ నదిలో టిబెట్ వైపు ఏదైనా విపత్తు సంభవిస్తే.. చైనా దాన్ని భారత్‌కు చేరవేయకపోతే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగే ప్రమాదం ఉంది. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో అంటారు. ఈ నదిపైనే చైనా ఏకంగా 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో భారీ జలవిద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇందుకోసం డ్యామ్ నిర్మాణం చేపడుతోంది. చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా ఇది మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో నీరు రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో పైనుంచి పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా చేయొచ్చు. ఏటా 60వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేయగలదని చైనా చెబుతోంది. అయితే, ఈ నిర్మాణ ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆ మధ్య చైనా జియలాజికల్ సర్వే పర్యవేక్షణలో ఓ అధ్యయనం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగు భాగంలోనే 'పైజెన్ ఫాల్ట్' (పగులు) ఉందని, ఇది అక్కడున్న రాళ్లను చీల్చుతున్నట్లుగా అందులో గుర్తించారు. ఈ బీటలు జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో నిర్మించే డ్యామ్‌లు, రోడ్లు, వంతెనలు, సొరంగాల వంటి మౌలిక సదుపాయాలను గణనీయంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల భూకంపాలు సంభవిస్తే ఇక్కడ పరిస్థితిని అంచనా వేయడం కూడా కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై భారత్‌లో కోట్లాది మంది ప్రజల జీవనం ఆధారపడి ఉంది. అస్సాం, అరుణాచల్ రాష్ట్రాల ప్రజలకు ఈ నదే ప్రాణాధారం. మామూలుగానే ఏటా బ్రహ్మపుత్రలో వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు చైనా ఈ డ్యామ్‌ను నిర్మించిన తర్వాత.. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తి మెగా డ్యామ్ నుంచి ఒక్క పెట్టున అపార జలరాశిని విడుదలచేస్తే అది మన ఈశాన్య రాష్ట్రాల్లో విలయం సృష్టించే ప్రమాదం ఉంది. మరోవైపు, డ్యామ్ నిర్మాణం వల్ల బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గిపోయినా పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. చైనా దిగువకు నీటికి విడుదల చేయకపోయినా.. నదిలో నీటి లభ్యత తగ్గితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకే బీజింగ్ మెగా డ్యామ్ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 11వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిలో నిర్మించతలపెట్టిన ఈ డ్యామ్.. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు దీన్ని డ్యామ్ అని కాకుండా 'వాటర్ బాంబ్' అని పిలుస్తున్నారు. చైనా ఆధీనంలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ఆనకట్ట నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ రీజియన్ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తాయి. ఒకవేళ డ్యామ్ నిర్మించాక భూకంపం ఏర్పడితే భారత్, బంగ్లాదేశ్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది. భూకంపాల కారణంగా భారీ వరదలు ఏర్పడతాయి. అందుకే మైడాగ్ డ్యామ్ భారత్‌కు వాటర్ బాంబ్‌లాగా మారనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మైడాగ్ డ్యామ్ విషయంలో భారతీయులు మాత్రమే ఆందోళన చెందడం లేదు. చైనా భూగర్భ శాస్త్రవేత్తలూ ఈ ఆనకట్టపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే బ్రహ్మపుత్ర జలాలు చైనా ఆధీనంలోకి వెళ్లిపోతాయి. చైనా జలాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి ఒకేసారి విడుదల చేస్తే ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వరదలు ఏర్పడతాయి. మరోవైపు సమ్మర్ లాంటి సీజన్లలో చైనా అసలు జలాలనే విడుదల చేయకపోతే నీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈ ముప్పు నుంచి తప్పించుకోవడానికి భారత్ కూడా ఓ మెగా ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిందని సమాచారం.

## వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

**భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు**

వాషింగ్టన్,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్టు అమెరికా తాజాగా ప్రకటించింది. అమెరికా కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసు కున్నాయి .వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించడం, ముఖ్యంగా వారు అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా అనే అంశాన్ని అంచనా వేయడంపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ శిక్షణ కోసం కొన్ని వీసా అపాయింట్ మెంట్లను మార్చుతున్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొంతమంది దరఖాస్తుదారులకు కూడా అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని సమాచారం అందించారు ఇటీవలి కాలంలో అమెరికాలో హెచ్-1బీ ఆమోదాల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం అమెరికా యూనివర్సిటీలలో 3,30,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందువల్ల వీసా ఇంటర్వ్యూ తేదీలో ఆలస్యం విద్యార్థుల యూనివర్సిటీ జాయినింగ్ తేదీలను, ఉద్యోగుల జాబ్ ఆఫర్లు, రీలొకేషన్ ప్లాన్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు లేదా హెచ్-1బీ వర్క్ వీసాల జారీని పూర్తిగా నిలిపివేయలేదు. అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్‌లో అంతరాయం మాత్రమే ఏర్పడుతోంది. అమెరికా ఇప్పటికీ భారతీయ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులకు ముఖ్యమైన గమ్యస్థానంగానే ఉంది. అయితే వీసా స్క్రీనింగ్, హెచ్-1బీ ఖర్చులు, ఎంపిక విధానం, ఎఫ్-1 నిబంధనలు, అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు రావడంతో అమెరికా వెళ్లే ప్రణాళిక గతంలో కంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఏర్పడింది.

## రాఖీ పౌర్ణమి..అన్నా చెల్లెళ్ల ప్రేమకు ప్రతీక

హైదరాబాద్,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): 'రక్ష' అనగా రక్షణ, 'బంధన్' అనగా కట్టడం. సోదరి తన సోదరుని క్షేమంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ చేతికి రాఖీ కడుతుంది.హామీ: సోదరుడు ఎల్లప్పుడూ తనకు అండగా ఉంటానని, రక్షణగా నిలుస్తానని సోదరీమణులకు మాటిస్తాడు. హిందూ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం, శ్రావణ మాసం పౌర్ణమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. దీనిని కొన్ని ప్రాంతాలలో 'జంధ్యాల పౌర్ణమి' అని కూడా పిలుస్తారు, ఎందుకంటే ఈ రోజే జంధ్యం ధరించేవారు కొత్త జంధ్యాన్ని మారుస్తారు. హిందువులు జరుపుకునే పండుగల్లో రాఖీ ఒకటి. ఈ వేడుక సోదర, సోదరీమణులకు మధ్య ప్రేమకు గుర్తుగా పేరుగాంచింది. రాఖీ కట్టిన తన సోదరికి సోదరుడు తన జీవితాంతం అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుడి మణికట్టుపై రాఖీకట్టి స్వీటు తినిపించి, హారతినిస్తారు. తనకు రాఖీ కట్టిన సోదరికి ఏదైనా చిరుకానుక బహుమతిగా ఇచ్చి జీవితాంతం కాపాడతానని హామీ ఇచ్చినట్లుగా భావిస్తారు. శుక్రవారం అక్కాతమ్ముళ్లు ఆనందోత్సవాల మధ్య పండుగను జరుపుకోనున్నారు. ఈ రాఖీ పర్వదినంపై నాటి నుంచి నేటి వరకు అనేక పురాణాలు, కథలు ప్రచారంలో ఉన్నాయి. సోదరుడికి కట్టే రాఖీలు సోదరీమణులకు ఎంతో రక్షణ కవచంగా నిలుస్తాయని విశ్వాసం. మార్కెట్‌లో రుద్రాక్ష, స్టోన్, వెండి, బంగారు రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుందన్‌లు, మెరుపులు జరీతో పాటు స్పాంజితో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. పిల్లలను ఆకర్షించేందుకు కార్టున్ రాఖీలు కూడా వచ్చాయి.పాతకాలంలో అతిపెద్దగా ఉండే రాఖీలు ధరించేవారు.



## నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు

**విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య**

**సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్**

ఖాట్మండ్,ఆగస్ట్27(ఆర్‌ఎన్‌ఎ): నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది.నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాట్మాండూకు పంపింది.





# స్వచ్ఛమైన విధులతో దోషరహిత ఓటర్ల జాబితా

### సర్ ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకే అగ్రస్థానం

### ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో చొరవ అభినందనీయం

### జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ లోపాలకు తావులేకుండా దోషరహితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సమష్టి కృషి అవసరమని.. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు చూపిన చొరవ అభినందనీయమని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో రాష్ట్రంలో సర్ పురోగతిపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సమీక్షా, పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఈవో వివేక్ యాదవ్, అదనపు సీఈవో ఎస్.డిల్లీరావుతో పాటు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, గుంటూరు కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, పల్నాడు కలెక్టర్ డా. కృతికా శుక్లా, తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి, పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి, బాపట్ల కలెక్టర్ డా. వి.వినోద్ కుమార్, ఆయా జిల్లాల ఈఆర్‌వోలు ప్రత్యక్షంగా హాజరుకాగా వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు. ద

ప్రస్తుతం నోటీసుల జారీ, విచారణ, క్లెయిములు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్.. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 43,71,397 నోటీసుల పంపిణీ కాగా 16,23,774 నోటీసులపై క్షేత్రస్థాయిలో విచారణ పూర్తయింది. ఈ నేపథ్యంలో నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలో ముందంజలో ఉన్న జిల్లాలను అభినందిస్తూ.. మిగిలిన జిల్లాలోనూ నాణ్యంగా, వేగంగా, పారదర్శకంగా సర్ స్ఫూర్తికి అనుగుణంగా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు దిశానిర్దేశం చేశారు. నోటీసులపై విచారణకు సంబంధించి ప్రస్తుతానికి అత్యల్పంగా 15.18 శాతం మాత్రమే పెండింగ్ ఉన్న కర్నూలు జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీల మధ్య సమన్వయం, సహకారం అనేవి ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కీలకమని.. ఎవరికి ఏ సందేహమున్నా నివృత్తి చేయడం, సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు సంతృప్తికరంగా అందించడంలో ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ సూచించారు. ప్రస్తుత దశలో జిల్లాల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిబంధనల ప్రకారం సరైన కార్యాచరణపైనా సమావేశంలో చర్చించారు. వృద్ధాప్యం, అనారోగ్యం వంటి వివిధ కారణాల వల్ల విచారణకు హాజరుకాలేని పక్షంలో ఈఆర్‌వో/ఏఈఆర్‌వో – బీఎల్‌వోను సమన్వయం చేసుకుంటూ ఇంటి సందర్శన, వివిధ మార్గాల ద్వారా ఓటర్లకు సహాయసహకారాలు అందించాలన్నారు. అదేవిధంగా నోటీసులపై విచారణ అనంతరం క్వాసీ జ్యుడీషియల్ అధికారి అయిన ఏఈఆర్‌వోలు సమస్యను అర్థం చేసుకొని న్యాయమైన తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశం సందర్భంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితరాల స్వీకరణ, పరిష్కారం తదితర అంశాలనూ డా. పవన్ కుమార్ శర్మ పరిశీలించారు.



# ఉద్యోగ అవకాశంతో రాణించాలి

## సెంచూరియన్ యూనివర్సిటీతో కొలువులు

### నియామక పత్రాలు అందజేత.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, ఆగస్టు 27: ఉద్యోగ అవకాశం వచ్చిన యువకులు రాణించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో గజపతినగరం పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన జాబ్ మేళా ఇంటర్వ్యూలలో ఎంపికైన విద్యార్థులకు గురువారం మంత్రి క్యాంప్ కార్యాలయం నందు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఉద్యోగం పొందటం కష్టంగా ఉందని, తొలి ప్రయత్నం లోనే ఉద్యోగం సాధించడం మీ అదృష్టం తో పాటు, మీ ప్రతిభకు తార్కాణమన్నారు. నేటి చిన్న ఉద్యోగమే భవిష్యత్తులో అనుభవం నేర్పుతుందన్నారు. పెద్ద ఉద్యోగానికి ఈ చిన్న ఉద్యోగ అనుభవం పనిచేస్తుందని, ఎక్స్పీరియన్స్ ఉంటేనే అర్హత సాధిస్తారనే విషయాన్ని యువత తెలుసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, యువ నాయకుడు లోకేష్ గారు నిరుద్యోగ సమస్య పరిష్కరించడం కోసం పరిశ్రమలు స్థాపన చేయటం జరుగుతుందన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వారు నియోజకవర్గ నిరుద్యోగ యువతకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. 27 మందికి నియామక పత్రాలు అందజేశారు. వీరికి జీతంతో పాటు వసతి సౌకర్యం కూడా సెంచూరియన్ యూనివర్సిటీ వారు అందించటం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ ప్రతినిధులు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.




# జువినైల్ జస్టిస్ యాక్ట్(2015) పై సమీక్షా

రాష్ట్ర మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శ్రీమతి ఏ సూర్య కుమారి జువినైల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అమలు చేస్తున్న జువినైల్ జస్టిస్ యాక్ట్ పై సమీక్షా నిర్వహించారు. ఈ యాక్ట్ ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సెప్టెంబర్ 5న నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జువినైల్ జస్టిస్ కమిటీ మీటింగ్ కు ఈరోజు విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువినైల్ జస్టిస్ బోర్డు మరియు వివిధ శాఖలతో సమీక్షా నిర్వహించడం జరిగింది. ఈ 10 సంవత్సరాలలో యాక్ట్ అమలు చేస్తున్న కార్యక్రమాలు శాఖలవారీగా వివరించారు. అదేవిధంగా సమర్థవంతంగా అమలుచేయుటకు అన్ని శాఖలనుండి సూచనలు మరియు సలహాలు తీసుకున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీ యమ్ వేణుగోపాల్ రెడ్డి, జువినైల్ వెల్ఫేర్ డైరెక్టర్ శ్రీమతి వసంత బాల, మిషన్ వాత్సల్య జాయింట్ డైరెక్టర్ శ్రీమతి శిరీష, ఏపీపీ ద్రైవ ప్రసాద్,యూనిసెఫ్ ప్రతినిధులు, డీపీఓలు, డీసీపీవో లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ లు, మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సర్‌లో వేగం..

# విచారణలో పారదర్శకత..

# ఓటర్ల జాబితాలో కచ్చితత్వం

### ఎన్‌టీఆర్, కృష్ణా జిల్లాల్లో సర్ పురోగతిపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సమీక్ష

### నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలో రెండు జిల్లాల అధికారుల పురోగతిపై అభినందనలు

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై గురువారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ.. ఎన్‌టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లాలకు సంబంధించి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఈవో వివేక్ యాదవ్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కృష్ణా కలెక్టర్ డా. డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రెండు జిల్లాలకు సంబంధించిన 14 మంది ఈఆర్‌వోలు, ఒక్కో శాసనసభ నియోజకవర్గం నుంచి నలుగురు పోలింగ్ బూత్ స్థాయి అధికారులు హాజరయ్యారు. సర్ ప్రక్రియలోని ప్రస్తుత దశలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారం గురించి డా. పవన్ కుమార్ శర్మ చర్చించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, అందుబాటులో లేని ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, ఒకచోట కంటే ఎక్కువ చోట్ల జాబితాలలో పేర్లను కలిగిన ఓటర్లు తదితర విషయాలలో ప్రత్యేక దృష్టితో కృషిచేసి గణనీయమైన ఫలితాలను సాధించినందుకు రెండు జిల్లాల అధికారులను అభినందించారు. అదేవిధంగా నోటీసుల జారీ, విచారణ దశ విషయంలో సాధించిన పురోగతిపైనా, ఎదుర్కొన్న సమస్యలు, వాటి పరిష్కారాల గురించి చర్చించారు. ఎన్‌టీఆర్ జిల్లాలో 1,93,574, కృష్ణా జిల్లాలో 1,09,902 నోటీసులు జారీ చేయడం జరిగింది. ఎన్‌టీఆర్ జిల్లాలో ఇప్పటివరకు 90,588, కృష్ణా జిల్లాలో 49,277 నోటీసులకు సంబంధించి ఓటర్లను విచారించడం జరిగింది. ఫారం 6, 7, 8 స్వీకరణ, పరిష్కారంలోనూ ప్రగతి దిశగా పయనిస్తున్నాయి. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారాన్ని నిర్దిష్ట గడువులోగా అత్యంత పారదర్శకత, కచ్చితత్వంతో పూర్తిచేయనున్నట్లు జిల్లాల ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, ఓటు భద్రతకు భరోసా కల్పించేలా సమష్టి కృషితో ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు.



# విశాఖ ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో-2026

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆహ్వానం

అమరావతి, ఆగస్టు 27 : విశాఖపట్నంలో సెప్టెంబర్ 11వ తేదీన జరిగే "ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో -- 2026" ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ఆహ్వానించారు. గురువారం ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు గారు, ప్రతి నిధి లక్ష్మీనారాయణ గారు మంత్రిని సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కలిసి అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఛాంబర్స్ ప్రతి నిధులు ఎక్స్‌పో వివరాలను మంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పోర్ట్-ఆధారిత అభివృద్ధి, ఫిన్‌టెక్ మరియు అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 3 రోజుల పాటు ఈ బిజినెస్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.



# జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

### జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

విజయవాడ: ఆగస్టు 27,2026:ం"ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సందర్భాలు"లి కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆగస్టు 28వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.జగ్గయ్యపేట ఎస్.వి.ఎస్ కళ్యాణ మండపంలో ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ కోరారు.



# ఎన్‌టీఆర్ పట్టా భూ యజమానులకు చట్టబద్ధమైన హక్కు

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

జిల్లాలో పాత పట్టాలు కలిగి ఉండి భూమిపై పూర్తి స్థాయిలో చట్టబద్ధమైన హక్కులు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూ యజమానులకు చట్టబద్ధమైన హక్కు కల్పించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలనిజిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో గతంలో ఎన్ టి ఆర్ పట్టాలు పొందినప్పటికీ పూర్తి స్థాయిలో చట్టబద్ధమైన హక్కులు పొందలేకపోతున్న వారు సుమారు 20 వేల మంది ఉన్నట్లు తెలిపారు.

అటువంటి భూ యజమానులకు హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూముల సర్వే సమయంలో సంబంధిత భూ యజమానులను భాగస్వామ్యం చేసి, వారి వద్ద ఉన్న పాత పట్టాలు, భూ హక్కులకు సంబంధించిన పత్రాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట భూమి సరిహద్దులను గుర్తించి, భౌతిక పరిస్థితులను రికార్డుల్లోని వివరాలతో సరిపోల్చాలని ఆదేశించారు భూముల సర్వే నుంచి ఎన్‌టీఆర్ పట్టా జారీ చేసే వరకు ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం, నిబంధనల పాటింపు ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండలాల వారీగా ఎన్‌టీఆర్ పట్టా ద్వారా ప్రయోజనం పొందాల్సిన భూ యజమానుల వివరాలను సేకరించి, సర్వే పూర్తి చేయాల్సిన భూములను గుర్తించి, దశలవారీగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. చిరకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ఎన్‌టీఆర్ పట్టాదారులకు పరిష్కారం చూపి, అర్హులైన భూ యజమానులకు వారి భూమిపై చట్టబద్ధమైన హక్కును కల్పించడమే ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

# రీ సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలి



**జగిత్యాల, ఆగస్టు 27 :**

